## సృజన మేఘం-2

మేఘానికి బహు ఇష్టం / మానవ కథ అంటే
కాలానికి నిజ రూపం / మానవ కథతోనే.
చేతనలో బింబంగా / గగనంలో మేఘం
అల పయి సుమ యానంలా/ఊరుపులో కాలం!

○ ○ ○

గత చరితకు బంధువయి / పక్షి ఎగిరి పోతుంది
వర్తమాన మిత్ర మయి / కుసుమం వికసిస్తుంది
ఎండిపోయి నిర్ఘరి / నిన్నటిదయి పోతుంది.
బ్రతుకుతుంది కోరిక / జలదంతో ప్రాణితమయి

○ ○ ○

గోడకు చెవులుంటాయని / అంటూ ఉంటారు కాని
కండ్లూ నోరూ కాళ్ళూ / మస్తిష్కం కూడానూ
గోడల వలె/నిలిచిన మనుషుల పయి/అపుడపుడూ
మేఘం కనిపించీ/లోలోపల/మరచిన నిజ రూపం
మెరుపులతో / చూపుతుంది మనిషికీ

○ ○ ○

ప్రాణానికి అనలం / ఒక కళగా రాణించనీ
దేహంలో అనలం / ఒక లతలా కదలాడనీ
బూదిని చేసే ఆ / లయ సమయం రాకూడదు.
మనసున జలదంతో / సృజన భూమి మేల్కొననీ
మేఘుని ఆగమనంతో / అక్షరాల బోను నుండి
విడుదలతో బయటపడే / ఒకటొకటీ ఊహల
మనసుకు నవ వాహనమయి / మనిషిని నడిపించేను
అశ్వమొ! హరియొ! మయూరమొ!
హరిణమొ! ఖగమొ! మరొకటో!

○ ○ ○

ప్రతి రోజొక కొత్త భాష / వినిపిస్తుంది సమాజం
అది నేర్చే లోపలనే / మరో రోజు వస్తుందీ.
కాలం పయి వచ్చే మబ్బులతో
తొలి బీజం మాయం అయ్యేను
కాలంతో పొందే మార్పులతో
తొలి పాత్రల రూపం మారేను.
నిలవ నీడలేని / ద్రిమ్మరి మనిషీ / అతనికొక మిత్రం
తలపై మేఘం!
ధనం బలం లేని/బికారి బ్రతుకూ/అతనితో పయనం!
తలపై నిధిలా / ధనం బలం లేని
బికారి బ్రతుకూ/అతనితో పయనం!/తలపై నిధిలా

○ ○ ○

ఇరువురిదీ ఒకే / దారి స్వేచ్ఛలో/ అవని పయి తాను
నింగిలో మిత్రం! / ఎపుడో కనిపించేనా?
తన కోసం వచ్చేనా?
ఒక గొడుగయి నీడయి / తన మస్తిష్కంలో!
తన ముఖాన / చిరు నగవులతో/ కనుల నుండి
జల కళికలతో / పేద ముందు /కురిసే మేఘం
కరుణకు ఒక / మృదు నవరూపం

○ ○ ○

గగన వీధుల / ఆప్త మేఘం
పగలు రాత్రులు / ఒకే పయనం!
మనిషి మరచిన / ప్రేమ బిందువు
లొలుకుతూ ఒక / జ్ఞాపకంగా.

-మాదిరాజు రంగారావు

# పెన్మిటి

-కనపర్తి రాజశేఖరమ్

అద్దమ్ముంగల నిలవడి సోకులన్ని సేసుకొని పెన్మిటి దిక్కుజూసి కిలుక్కుమని నవ్వంగనే నవ్వుకు బదులు నవ్వు నవ్విండు. గల్మ దాటి బైటికచ్చి ఎటుదిక్కు సూడకుండ సరసర నడ్సుకుంట పొద్దూకంగ ఆ యింటికి పోయి చిమ్మన్చీకటైనంక ఆల్లింటికత్తుంది.

కులపోల్లంత పనిగట్టుకొని దాని రాకపోకల మీద కన్నేసి కాపుగాత్తుండ్రు. మన కులంల గిట్లసేసి నోల్లున్నరా. బయ్యంలేని కోడి బజాట్ల గుడ్డువెట్టిందట పెన్మిటి బయ్యంలేదు ఎవల బయ్యం లేదు పూరా ఎగిడిసిన గుర్రమైంది నెరీ రెచ్చిపోతుందని ఇంటి ముంగల అరుగుల మీద కూసున్న అమ్మలక్కలంత తలోమాటంటుండ్రు. పలానామె గిట్లటని ఎవలన్నంటే నామోషి కాదా... నామర్ద కాదా.. ఓరోజు సిన్నాపెద్దా ఆడమొగ అనకుండ అందరు బంతిగట్టుకొని మొగని దగ్గరికి పోయి గట్టిగ నిలదీసిండ్రు. ఇగో నీ పెండ్లాన్ని అదుపులో పెట్టుకో లేకుంటే మంచిగుండది. మాకూ పెండ్లాం పిల్లలు ఉన్నరు మా వోల్లు గూడ సెడిపోతరు. నువ్వూకుంటే- మేమూకోము సారుగమ్మకాడికి పిలిపిచ్చి పంచాయితి పెట్టిత్తం అక్కడ్నే బంగన బయలు సేయకుంటే మంచికి సెడ్డకు మీయింటికి రామని కాకుల్లెక్క కవ్వర్కవ్వర ఒర్రచ్చిండ్రు.

మొగనికి తొక్కుడు బండకున్నంత ఓపికుంది. ఉల్కులేదు పల్కులేదు మొగమ్మీదూంచినట్లే మాట్లాడినా కోపానికి రాలేదు శాన ఓపిక పట్టిండు. లోకులు కాకులన్నది బైటవడ్డది. పెండ్లాం దిక్కుజూసి ఎవలే మనుకున్న నువ్వు బయపడకు. నువ్వు సెయ్యాలనుకుంది సేసెయి. నా మద్దతు నీకెప్పుడుంటది. తొవ్వొంట పోతుంటే కుక్కలెన్నో మొరుగయా... ఇదీ గంతే. దైర్యం గల్ల ముచ్చట్లు జెప్పి ఎయ్యేనుగుల బలాన్నిచ్చిండు.

○ ○ ○

ఏకంగా ఆ పరాయి మొగోడు ఆల్లింటికే అత్తుండు పోతుండు. వన్నెలు సిన్నెలు వానెంట వానీ పెండ్లాం మందెంటని ఉబ్బాగవట్టక ఓమిడిగుడ్ల ముసలోడు అననే అనే. అదే నా పెండ్లామైతెనా నీయక్క ఎల్లవ్వ తల్లి దగ్గర గొర్రెపిల్లను గావువట్టినట్లు గావువట్టి గత్తర్గత్తర సేసెటోన్నని ఇంకోడనే. గల్మ దాటి బైట కాలువెట్టి నందుకు నరికి పోగులు పెట్టెటోన్నని మల్లొకడనే. ధూ... వానికి సిగ్గు మానముంటే గదా.. వాడు మొగోడైతేగదా అని తిట్టిన తిట్టు తిట్టకుండ తిడుతుంటే సెవుల తూట్లు పడుతున్నయి.

ఎట్లన్నజేసి ఆల్లనోరు మూపిచ్చే రోజుకోసం సూత్తుండు. దున్నపోతులు ఉరికచ్చురికచ్చి గుద్దినట్లు దడేల్దడేల్మని సేతుల్తోని గుద్దుకుంట పెక్కపెక్క కాల్లతోని తన్నుకుంట మూసున్న తలుపుల్ని ఊడగొట్టిండ్రు. ఇయ్యాలేదో వోటి తేలిపోవాలంతే గుత్పపట్టుకొని ఆ తల్పులెన్కే నిల్సోని ఉగ్రనర్సిమ్మ సామోలెకనవడ్డడు. అరేయ్ దమ్ముంటే ముందుకు రాండ్రి సాటు కూతలు కాదురా. నా పెండ్లాం మీద నిందమోపుతార్రా అని అగ్గిమీది గుగ్గల్లమైండు. గ్యారెడోల్లు గ్యాస్ నూనెను పుక్కిట్ల వట్టుకొని అగ్గిపుల్లనుగీకి మంటకెదురుంగ ఊత్తేమంటెట్ల మీదికి లేత్తదో అట్లనే... బైటికి కనడవతలేదుగని లోపలట్ల బగబగ మండుతుండు. రాండ్రా రాండ్రి అందరూ సూడండ్రా ఆల్లేంజేత్తుండ్రో బాగా సూడుండ్రా. ఊరంతా దద్దరిల్లెటట్లు ఒర్రుతుండు. ఎవ్వలన్న ముందుకత్తే దొర్కవట్టిగావువట్టె తట్టు ఉన్నడు. ఆని కోపంజూసి ఇన్రోజులు కవ్వర్కవ్వర ఒర్రినోల్లు సడీసప్పుడు లేకుండ నిలవడ్డరు. ఆల్లిద్దర్ని సూడంగనే ఏగిర్తపడి అన్నోల్లందరి తల్కాయలు గిర్రున దిర్గిపోయి నయి. నోట్లకెల్లి మాటలు పెకుల్తలేవు బెల్లంగొట్టిన రాయిలెక్క నిలవడ్డరు. గట్టు మొరిగిన కుక్కలు గుట్టుగ సచ్చినట్లైనయి.

ఆని పెండ్లామే నడుమ సొచ్చుకచ్చి మొగన్ని శాంతపర్చుకొని ముచ్చటప్పటికే ముదిరిపోయిందని మెల్లగ నోరుదెర్సింది. ఇన్రోజులు పోయింది ఈ పరాయి మనిషి దగ్గరికే మీరనుకున్నట్లు తలవంపులు తెచ్చిపెట్టే పనుల్జేయలేదు. ఈయ్నే మనూరికచ్చిన కొత్త పంతులు సయాన మా పెద్దమ్మ కొడుకు ఇసొంటి మోకమల్ల దొరుకదని ఆయ్నే దగ్గరికి పోయి సదువుకుంటున్న. నా పెన్మిటి దుబాయ్‌కి పోతుండు ఉత్తరం రాయాలంటే ఎవ్వల దగ్గరికి పోవాలె. రేపాయ్నె దుబాయ్‌కి పోయినంక నేను బైటికిపోతే ఇనుపముక్క కాకుల్లెక్క పొడ్సుక తినరా.. ఆయ్నె బలిమితోనే సదువు నేర్సుకుంటున్న. సదువు నేర్సుకుంటే సంసారాలు సక్కవడుతయి. సదువురాకుంటే శాన కట్టమని తెల్సుకున్న నా పెన్మిటి నన్ను నమ్మిండు. నా మీద బాగ నమ్మికముంది. మొగడు పెండ్లాకు ఒగలమీద ఒగలకు నమ్మిక ఉండాలే అనుమానం కాదు. గా నమ్మికంతోనే పోయి నాలుగక్షరాలు నేర్సుకున్న అంతే నేన్జేసిన తప్పుపనేందో ఇప్పుడు నిలెయ్యేండ్రని సవాలిసిరింది. ఇంకేముంది గాలివాన ఎల్సినట్టైంది అందరూ దాపుల కచ్చిండ్రు. బుద్ధిపాడుజేసుకొని ఇవతలోల్ల జోలికి పోయి సిగ్గుమానం దీసుకోకుండ్రి. మీరందరు రాత్రి బడికిపోయి సదువుకోండ్రి. తతిమ్మ మందికి జెప్పి ఆల్లనుగూడ రాత్రి బడికి తోలుకపోండ్రి.

అందరి అనుమానాలు దీర్చి ఎవలిండ్లకు ఆల్లను పంపిచ్చి కోపంతోని ఊగిపోయిన పెన్మిటిని సెంపమీద ముద్దువెట్టి సల్లవర్సుకుంది. నా పెన్మిటి బంగారమని మురిసిపోతుంది.

■

## పరమార్థం

చెప్పే వాడికీ
చదివే వాడికీ
తెలియదు
పిల్లనిచ్చేవాడికి / మాత్రం తెలుసు
చదువుల 'పరమార్థం'

-డి.శ్రీనివాస దీక్షితులు